క్లుప్తంగా

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రాయపర్తి: తెలంగాణ ప్రజాప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తుందని వర్ధన్న పేట వ్యవసాయ మార్కెట్ వైస్‌చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని రైతువేదికలో ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న జీలుగు విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి గుమ్మడి వీరభద్రం, కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ కుంట రమేష్, ఏఎంసీ డైరెక్టర్ ఖాజామియా, పెండ్లి మహేందర్‌రెడ్డి, రైతులు, నాయకులు ఐరెడ్డి ఎల్లారెడ్డి, ఈదులకంటి మహిపాల్‌రెడ్డి, బన్నా నాయక్, వీరునాయక్ పాల్గొన్నారు.

నల్లబెల్లిలో కంటి వైద్యశిబిరం




వర్ధన్నపేట: మండలంలోని నల్లబెల్లి గ్రామంలో అగర్వాల్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం మంగళవారం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుడు బిర్రు రాజు పాల్గొని వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం సేవ అందించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో సుమారు 150 మంది పరీక్షలు చేసుకోగా అందులో 50 మంది వరకు కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. వీరందరికీ వారం రోజుల్లో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించనున్నట్లు నిర్వాహకుడు బిర్రు రాజు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు హరికృష్ణ, శైలజ, మేనేజర్ లక్ష్మీనారాయణ, రమేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు తాటికాయల దిలీప్, మార్కెట్ డైరెక్టర్ మల్యాల దేవేందర్, నాయకులు యాదగిరి, చంద్రయ్య, భాస్కర్, వెంకన్న, సంపత్‌రెడ్డి, శివాజీ, సురేష్, రమేష్, పరశరాములు, భాస్కర్, కుమారస్వామి, ప్రభాకర్, అరుణ్, నాగరాజు, హరీష్, వినీత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



రాయపర్తి: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మండలంలోని జేతురాంతండాకు చెందిన బోజ్యానాయక్‌కు రూ.10 వేలు అందించినట్లు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లేతాకుల రంగారెడ్డి తెలిపారు. మంగళవారం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి పంపించిన నగదును బాధితుడికి అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జేతురాంతండా మాజీ ఉపసర్పంచ్ జాటోతు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నానునాయక్ ఆశయాలు కొనసాగిద్దాం



రాయపర్తి: ప్రజాసమస్యల పరిష్కారంకోసం బహుజన ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొని పరిష్కారంకోసం కృషి చేసిన గుగులోతు నానునాయక్ ఆశయసాధనకోసం కృషి చేద్దామని ఎంసీపీఐ(యూ)జాతీయ ప్రధానకార్యదర్శి మద్దికాయల అశోక్ పిలుపునిచ్చారు. మంగళవారం నానునాయక్ వర్ధంతిని మండలంలోని జయరాంతండా(ఎస్) గ్రామంలో నిర్వహించారు. నానునాయక్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూజ.. నానునాయక్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకోసం పోరాడారని తెలిపారు. ఆయన మృతి బహుజనులకు తీరనిలోటని అన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, కేంద్రకమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, సుధీర్‌రెడ్డి, గద్దం నాగార్జున, ఎన్‌రెడ్డి, హంసారెడ్డి, కర్ర రాజిరెడ్డి, సావిత్రి, మంద రవి, జిల్లా కమిటీ సభ్యుడు గుగులోతు అరుణ్‌నాయక్, కాయిత వెంకన్న, బత్తిని కుమారస్వామి, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను పట్టించుకోరా..?

- నర్సంచ్‌ల పాలన ముగిసి 16నెలలు
- గ్రామాలకు రాని ప్రత్యేకాధికారులు
- నిధులు లేక సౌకర్యాలు నిల్
- నిబంధనలకు విరుద్ధంగా నిధుల సర్దుబాటు



ట్రాక్టర్‌లో చెత్త వేస్తున్న మహిళ



చెత్త సేకరిస్తున్న సిబ్బంది

దుగ్గొండి: గ్రామాల్లో సర్పంచ్‌ల పాలన ముగిసి 16 నెలలు కావస్తుంది. వారి స్థానంలో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. వారు పనిఒత్తిడి కారణంగా గ్రామపాలనపై దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారు. ఫలితంగా గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. మండల వ్యాప్తంగా 34 గ్రామ పంచాయతీలు ఉండగా 15 మంది ప్రత్యేక అధికారులుగా నియమితులయ్యారు. ఒక్కో అధికారికి రెండు నుంచి మూడు గ్రామాల బాధ్యతలు అప్పగించారు. అయితే వారికి వారి శాఖలో పనులకే సమయం సరిపోవడం లేదు. దీంతో వారు పేరుకే ప్రత్యేక అధికారులుగా మారిపోయారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా భారమంతా పంచాయతీ కార్యదర్శులదే అవుతుంది. 16 నెలలుగా ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు రాలేదు. గ్రామాల్లో వసూలు అయిన ఇంటి, వాణిజ్య పన్నుల డబ్బు మరమ్మతులకే సరిపోవడం లేదు. దీంతో ఒక్కో కార్యదర్శి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. ఇక తమ వల్ల కాదని చేతులెత్తుస్తున్నారు. నీటి సరఫరా బావుల మోటారు కాలిపోవడం, వీధిలైట్లు మరమ్మతులు సైతం చేయలేకపోతున్నారు. గ్రామాల్లో చెత్త సేకరించే ట్రాక్టర్లలో కనీసం డీజిల్ పోసే పరిస్థితి లేకపోవడం అడపాదడపా మాత్రమే చెత్త సేకరణ చేపడుతుండడం గమనార్హం. ఇదిలా ఉండగా.. బకాయిలు రూ.వేలల్లో పెండింగ్ ఉండడంతో మండల పరిధిలో ఓ గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను పెట్రోల్ బంక్ యజమాని ఆపేశారు. బిల్లు ఇస్తేగాని ట్రాక్టర్‌ను కదలనిచ్చేది లేదని భీష్మించారు. దీంతో సదరు పంచాయతీ కార్యదర్శి తన సొంతడబ్బులు చెల్లిస్తానని చెప్పి ట్రాక్టర్‌ను విడిపించారు. ఇలా ఒక్కో పంచాయతీ రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు డీజిల్ బకాయి ఉన్నట్లు సమాచారం.

సాధ్యమైనంత వరకు పనిచేస్తున్నాం



ప్రత్యేకాధికారులుగా సాధ్యమైనంత వరకు పనిచేస్తున్నాం. నిధుల లేమీ కారణంగా పంచాయతీ కార్యదర్శులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతో పన్నుల ద్వారా వచ్చిన డబ్బును ఖర్చు చేస్తున్నట్లు తెలిసింది. వివరాలు సేకరించి మళ్లీ జమచేయించి ఖర్చు చేసిన నిధులను నిబంధనల ప్రకారం డ్రా చేయిస్తాం. చెత్త సేకరణలో అసౌకర్యం లేకుండా చూస్తాం.

– మోడెం శ్రీధర్‌గౌడ్, ఎంపీఓ

కల్తీ విత్తనాలను అరికట్టాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నర్సంపేట: కల్తీ విత్తనాలను అరికట్టి బ్లాక్ మార్కెట్‌లో విత్తనాలు అమ్ముతున్న వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని కఠినగా శిక్షించాలని తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఈర్ల పైడి డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పైడి మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ప్రారంభం కాబోతున్నందున రైతులు తమ పంట భూములను చదును చేసి విత్తనాలను విత్తుటకు సిద్ధంగా ఉన్నారన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభంలోనే ప్రతి సంవత్సరం వ్యాపారులు విత్తన కల్తీ చేసి రైతులను నిలువునా ముంచుతున్నారన్నారు. దీనికి తోడు ఏ విత్తనాలు అయితే మంచి దిగుబడి వస్తుందో ఆ విత్తనాల ప్యాకెట్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించి కృత్రిక కొరతను సృష్టించి బ్లాక్‌లో విత్తనాలు అమ్ముతూ రైతులను దోపిడీ చేస్తున్నారన్నారు. ప్రధానంగా వరంగల్ పట్టణం, నర్సంపేట కేంద్రంగా చేసుకొని దళారి వ్యాపారులు తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. వ్యవసాయ అధికారులు సరైన పర్యవేక్షణ చేయడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు బొర్ర ఆనంద్, తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు భూమా అశోక్, ఈరెల్లి రామచందర్, బర్ల గొరయ్య, శివరాత్రి కుమారస్వామి, ఎలకంటి కుమారస్వామి, కదారి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కీం నోటిఫికేషన్ విడుదల చేయాలి

నర్సంపేట: ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో, షెడ్యూల్ క్యాస్ట్, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా షెడ్యూల్ కులాలు, గిరిజన ఒకటో తరగతి, ఐదో తరగతి విద్యార్థుల కోసం నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ అన్నారు. ఈ మేరకు నర్సంపేట పట్టణంలోని ఎస్సీ కళాశాల హాస్టల్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బెస్ట్ అవైలబుల్ స్కీం నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో వినయ్, భాస్కర్, సతీష్‌కుమార్, అరవింద, తదితరులు పాల్గొన్నారు.

సంఘం నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న గోపు జయపాల్‌రెడ్డి

నర్సంపేట: సంఘంలో ప్రతి సభ్యులు పొదుపులు, అప్పులు సకాలంలో చెల్లించి సంఘం నియమ నిబంధనలు పాటించాలని రెడ్డి కుల రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు అంద్రు రాజేంద్రప్రసాద్‌రెడ్డి, రెడ్డి కుల రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని రెడ్డి పరపతి, సంక్షేమ సంఘాల కార్యాలయంలో మంగళవారం అధ్యక్షుడు కంది గోపాల్‌రెడ్డి, ఎర్ర యాకుబ్‌రెడ్డి అధ్యక్షతన 33వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్డి కులస్తులు సొంత అభివృద్ధితోపాటు పేద కుటుంబాలు, విద్యార్థులకు నిస్వార్థంగా సేవలందించాలన్నారు. ప్రతి రెడ్డి పేద రైతు కుటుంబానికి సంఘం నుంచి వ్యవసాయ పనిముట్లు బహూకరించే విధంగా చూడాలన్నారు. అనంతరం మోతె సమ్మిరెడ్డి, కిమ్మడి రవీందర్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కంది గోపాల్‌రెడ్డి, పరపతి సంఘం అధ్యక్షుడిగా ఎర్ర యాకుబ్‌రెడ్డి, సంక్షేమం సంఘం ఉపాధ్యక్షుడిగా తొగరు మల్లారెడ్డి, పరపతి సంఘం ఉపాధ్యక్షుడిగా కట్కూరి జయపాల్‌రెడ్డి, సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా బొద్దిరెడ్డి నర్సింహారెడ్డి, పరపతి సంఘం ప్రధాన కార్యదర్శిగా బొమ్మనపల్లి కేశవరెడ్డి, సహాయ కార్యదర్శిగా రేమిడి శ్రీనివాస్‌రెడ్డి, మోతె సంపత్‌రెడ్డి, కోశాధికారిగా మల్లాడి రవీందర్‌రెడ్డి, కుందూరు వెంకటరెడ్డిలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పల్లె శ్రీనివాస్‌రెడ్డి, గాయపు మాధవరెడ్డి, బుర్ర మోహన్‌రెడ్డి, మోతె జయపాల్‌రెడ్డి, గోగుల ప్రతాపరెడ్డి, గురుజాల తిరుపతిరెడ్డి, రాయుడ కరుణాకర్‌రెడ్డి, బత్తుల శ్రీనివాస్‌రెడ్డి, జంగం తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

బోధనా నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి



మాట్లాడుతున్న గాయపు లింగారెడ్డి



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

నర్సంపేట/ పర్వతగిరి/నర్సంపేట రూరల్/గీసుకొండ: మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధన నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని పర్వతగిరి ఎంఈఓ గాయపు లింగారెడ్డి, చెన్నారావుపేట ఎంఈఓ బైరి సరళ, నర్సంపేట ఎంఈఓ కొర్ర సారయ్య, గీసుకొండలో ఎంఈఓ సాంబయ్య అన్నారు. ఈ మేరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఐదురోజులపాటు నిర్వహించే శిక్షణను మంగళవారం పర్వతగిరి ఉన్నత పాఠశాల, మగ్దుంపురం గ్రామంలోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాల, ధర్మారంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. శిక్షణ కార్యక్రమాలను ఉపాధ్యాయులు వినియోగించుకోవాలన్నారు. ఎనిమిది మంది జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన ఆర్పీ(రిసోర్స్ పర్సన్)లు మండల స్థాయిలో ఐదు సబ్జెక్టుల బోధనపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొంకపాక కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎ.భిక్షపతి, పర్వతగిరి కాంప్లెక్స్ హెచ్‌ఎం పాక రమేష్‌బాబు, స్టేట్ ఆర్పీ శ్రీధర్, ఆర్పీలు కిశోర్, నాగేశ్వర్‌రావు, వీరేందర్, శ్రీధర్, అరవింద్‌కుమార్, ప్రసాద్, సంపత్, రాజు, జయముఖి కళాశాలలో నిర్వహించిన శిక్షణలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మనుపాటి పాపమ్మ, బోయినపెల్లి ప్రభాకర్‌రావు, జయముఖి ప్రిన్సిపాల్ హమీద్‌పాషా, కాలేజీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్స్ సునీత, రవి, సుభాష్, కొమురయ్య, వెంకన్న, రవి, సత్యనారాయణ, విజేందర్‌రావు, సెంటర్ ఇన్‌చార్జి ఉపాధ్యాయుడు సీహెచ్ ఐలయ్య పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాల్సిందే..



అంబేద్కర్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

- ఆల్ ట్రేడ్ యూనియన్‌ల నిరసన

నర్సంపేట: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు పోరాటం ఆగదని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేషం, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు హనుమకొండ శ్రీధర్, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు గుంపెల్లి మునీశ్వర్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో అఖిలపక్ష కార్మిక సంఘాలు సీఐటీయూ, బీఆర్‌టీయూ, ఏఐటీయూసీ, ఏఐఎఫ్‌టీయూ (న్యూ) ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల బాధ్యులు మాట్లాడారు. వివిధ డిమాండ్లతో కార్మిక వర్గం సంఘటితమై దేశవ్యాప్తంగా మంగళవారం నిర్వహించతలపెట్టిన సార్వత్రిక సమ్మెకు దేశంలో యుద్ధ వాతావరణ నేపథ్యంలో జూలై 9వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొల్లూరి లక్ష్మీనారాయణ, అక్కపెల్లి రమేష్, పైడి, మల్లయ్య, రాజు, నాగులు, వేణుచంద్ పాల్గొన్నారు.

మహిళలకు అండగా సఖీ సేవలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సఖీ సెంటర్ బాధ్యులు

ఖానాపురం: సమాజంలోని మహిళలకు సఖీ సేవలు అండగా ఉంటాయని సఖీ సెంటర్ కేస్ వర్కర్స్ తిరుమల, స్వప్న అన్నారు.ఈ మేరకు మండలంలోని మంగళవారిపేట గ్రామంలో సఖీ సేవలు, మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆపదలో ఉన్న మహిళల కోసం ఆసరాగా నిలుస్తామన్నారు. భయటకు రాలేని మహిళలు హెల్ప్‌లైన్ 181, పిల్లలైతే 1098, వృద్ధులైతే 1456 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందిస్తే సహాయాన్ని అందజేస్తామన్నారు. అనంతరం సఖీ సేవలపై కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విమెన్‌హబ్ బాధ్యులు హర్షిత, చైల్డ్‌లైన్ బాధ్యులు మౌనిక, మహిళా సంఘం సీఏలు సరోజన, సునీత పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

నర్సంపేట రూరల్ : వేర్వేరు ఘటనల్లో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. నర్సంపేటలోని మాదన్నపేట రోడ్డుకు చెందిన కోరబోయిన గోపాల్ ఇంట్లోకి అల్లాడి సాయిలుకు చెందిన మేకలు, గొర్రెలు వచ్చి మేస్తున్నాయి. దీంతో గోపాల్.. సాయిలును మందలించాడు. దీంతో సాయిలు కర్రతో గోపాల్‌ను తలపై కొట్టడంతో తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం గోపాల్ ఫిర్యాదు మేరకు సాయిలుపై కేసు నమోదు చేశారు. ఇదిలాఉండగా.. పట్టణంలోని సర్వాపురానికి చెందిన వల్లెపు శ్రీను.. అతడి చెల్లె కుంచరాపు స్వరూప ఇంటిపైకి వెళ్లి దుర్భాషలాడుతూ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్వరూప ఫిర్యాదు మేరకు వల్లెపు శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైతుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు

- ఏఐయూకేఎస్ రాష్ట్ర కార్యదర్శి చంద్రన్న



మహాసభలో మాట్లాడుతున్న చంద్రన్న

రాయపర్తి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాయని అఖిల భారత ఐక్య రైతు సంఘం(ఏఐయూకేఎస్) రాష్ట్ర కార్యదర్శి పాయం చంద్రన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని మైలారం గ్రామంలో వరంగల్ ప్రథమ మహాసభను మైదం పాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోడీ, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ పెట్టుబడిదారులకు కట్టబెడుతూ దేశ వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారని ఆరోపించారు. అర్హులైన రైతులందరికీ రూ.రెండు లక్షల రుణమాఫీ చేయకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. వ్యవసాయరంగంలో స్వామినాథన్ కమిషన్ సిఫారసును అమలు చేయాలన్నారు. ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జూలైలో దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులతోపాటు రైతు కూలీలు క్రియాశీలకంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐయూకేఎస్ వరంగల్ జిల్లా ప్రధానకార్యదర్శి చిర్ర సూరి, డివిజన్ అధ్యక్షుడు అర్షం సుధాకర్, సాబిరికాని మోహన్, మురళి, కొమురెల్లి, రాజు, గబ్బెట దేవేందర్, వెంకన్న, యాకయ్య, ఐలన్న, శ్రీనివాస్, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ఉత్తీర్ణులకు నగదు పారితోషికం




నగదు అందజేస్తున్న ఫౌండేషన్ బాధ్యులు, హెచ్‌ఎం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని గురిజాల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో చదివి ఇటీవల పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అలువాల జీకే ఫౌండేషన్ అవార్డుల ప్రదానం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అర్పిత చేతుల మీదుగా బహుమతులను అందించారు. బండారి స్వప్న 600 మార్కులకు 529 మార్కులు సాధించగా రూ.7వేలు, పెద్దారపు జ్యోతి (526మార్కులు)కి రూ.5 వేలు, గజ్జెల తేజ (522 మార్కులు) రూ.3వేల నగదు పారితోషికాన్ని జీకే ఫౌండేషన్ ప్రతినిధులు అలువాల లక్ష్మీ, నర్సయ్య అందించగా హెచ్‌ఎం అర్పిత విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి పారితోషికాలు అందించడంతో పోటీతత్వం పెరుగుతుందని, విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. విద్యార్థులకు నగదు పారితోషికం అందించిన జీకే ఫౌండేషన్ సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థులు ఏకాగ్రత, పట్టుదలతో చదివి ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. చదువుతోనే ఏదైనా సాధించవచ్చని అన్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు సాంబయ్య, అలువాల భాగ్యలక్ష్మి, అలువాల వీరేందర్, అలువాల శ్రీలత, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం.. పంచముఖి ఆంజనేయుడు

- రేపు హనుమాన్ జయంతి
- దీక్ష విరమణ చేయనున్న స్వాములు



పంచముఖి ఆంజనేయస్వామి

గీసుకొండ: కొనాయమాకుల సమీపంలోని వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారి పక్కన ఉన్న పంచముఖి ఆంజనేయస్వామి ఆలయం భక్తుల కొంగు బంగారంగా వాసికెక్కింది. ప్రతీ మంగళ, శనివారాల్లో భక్తులు ఇక్కడికి అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించడానికి ఇక్కడికి వస్తుంటారు. చాలా మంది భక్తులు మండల, అర్ధ మండల దీక్షలను స్వీకరించి నిష్ఠతో ఉంటారు. జగిత్యాల జిల్లాలోని కొండగట్టు తర్వాత హనుమాన్‌భక్తుల దీక్షల స్వీకరణ, విరమణకు ఈ ఆలయం ప్రసిద్ధి గాంచింది. మార్చి 30 నుంచి మే 12 వరకు 41 రోజుల మండల, 21 రోజుల అర్ధ మండల, 11 రోజుల ఏకాదశదిన దీక్షలను స్వాములు స్వీకరించారు.

హనుమాన్ జయంతికి ఏర్పాట్లు..

ఆలయంలో ఈ నెల 22న హనుమాన్ జయంతికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ధర్మకర్తలు సీతా ఆనంద్‌సా బ్రదర్స్, ప్రధాన అర్చకుడు జాగర్లపుడి అయ్యప్పశర్మ తెలిపారు. తెల్లవారుజాము నుంచి మంగళ వాయిద్యాలు, సుప్రభాత సేవ, ఉదయం నాలుగు గంటలకు గణపతి పూజ, మూల విరాట్ ఉత్సవ మూర్తులకు పంచామృత నవరసాభిషేకం, 6 గంటలకు అర్చనలు, తీర్థప్రసాద వితరణ, 8 గంటలకు ఉత్సవ మూర్తులకు అభిషేకం, 9 గంటలకు సహస్రనామార్చన, ఆకుపూజ, సింధూర విలేపనం, మహానివేదన, 10 గంటలకు ఉత్సవమూర్తులకు పల్లకీసేవ, ఊరేగింపు, మహాపూర్ణాహుతి, పండిత ఆశీర్వచనం, సత్కారం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా దీక్షాస్వాములు మాల (దీక్ష) విరమణ, మహా అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

మరమ్మతుకు గురైన చేతిపంపు

- అసహనం వ్యక్తం చేస్తున్న భక్తులు
- ఆలయ ఆవరణలోని చేతిపంపు బాగుచేయాలని వేడుకోలు



పనిచేయని చేతిపంపును చూపుతున్న భక్తులు

సంగెం: మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం సంఘమేశ్వరాలయంలోని చేతిపంపు పనిచేయక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు దర్శనానికి వెళ్లేముందు కాళ్లు కడుక్కొని వెళ్లడం ఆనవాయితీ. కానీ, రెండు నెలలుగా ఆలయంలోని చేతిపంపు పనిచేయకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా దాహంతో వచ్చిన భక్తులు తాగేందుకు సైతం వినియోగించే ఈ చేతిపంపు పనిచేయకపోవడంతో అసహనం వ్యక్తం చ చేస్తున్నారు. భక్తులకు ఎంతగానో ఉపయోగపడే ఈ చేతిపంపును త్వరగా మరమ్మతులు చేయించి వినియోగంలోని తేవాలని కోరుతున్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం

- రూ.38 లక్షలతో ఉడాయించిన వ్యక్తిపై కేసు

నర్సంపేట రూరల్ : రైల్వే శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి నలుగురి వద్ద రూ.38 లక్షలు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు నర్సంపేట ఎస్సై రవి కుమార్‌తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. నర్సంపేటకు చెందిన ఎండీ బాబా, నల్లబెల్లి మండలంలోని రుద్రగూడేనికి చెందిన మధు ఐటీఐ పూర్తి చేశారు. ఈక్రమంలో ఏపీలోని విజయనగరానికి చెందిన బండారు రామచంద్రకుమార్‌తో పరిచయం ఏర్పడింది. తాను రైల్వే శాఖలో టీసీగా పనిచేస్తున్నానని, ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి మధు నుంచి రూ.14.40 లక్షలు, ఎండీ బాబా నుంచి రూ.7 లక్షలు, మాసు శివకుమార్ నుంచి రూ.1.20 లక్షలు, మాదాసి రమేశ్ నుంచి రూ. 15.40 లక్షలు తీసుకొని నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చాడు. పత్రాలు నకిలీవని తేలడంతో రామచంద్రకుమార్ వద్దకు వచ్చి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో ఉడాయించాడు. దీంతో మంగళవారం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.